క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి శాంతి కల్యాణం



స్వామివారి ఉత్సవ మూర్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం రాత్రి శ్రీవారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుడిని ప్రత్యేకంగా ముస్తాబు చేసిన కల్యాణ వేదికపై అధిష్టంపజేసి విశేష పుష్పాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణం తిలకించారు.

- భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో మంగళవారం కార్తీక ఏకాదశి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కుళాయి ప్రారంభం



మరిడిమాంబ ఆలయం వద్ద కుళాయిని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కుళాయిని వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ దంపతులు ప్రారంభించారు. భక్తుల తాగునీటి అవసరాలు తీర్చాలని ఆలయకమిటీ సభ్యులు కోరడంతో జీవీఎంసీ అధికారులతో మాట్లాడి కుళాయి వేయించినట్టు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి శ్రీను, సత్యనారాయణ, ఐఆర్‌సీహెచ్ అప్పారావు, విందుల వరహాలు, సాయిన సన్యాసిరావు, బలిరెడ్డి శేఖర్, పాముల వసంతరావు, బండారు చందు, బుదిరెడ్డి కన్నారావు, సీరం దాసు చెల్లయ్య పాల్గొన్నారు.

ధనుర్మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వేదపండితులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఈకే చారి, వెంకటలక్ష్మి దంపతులు మాట్లాడుతూ వచ్చే నెల 16వ తేదీ నుంచి వచ్చే ఏడాది సంక్రాంతి రోజు వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రతినిధులు సాయిబు నాయుడు, నరసింగరావు మాస్టర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న వ్యాపారి శ్రీరామ్, వినోద్‌బాలు తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు సంజీవగిరి కాలనీకి చెందిన సంగీత అనే మహిళ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడింది. ఆమె భర్త పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. ఆమెకు వైద్యం చేయించేందుకు డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న శ్రీరామ్ అనే వ్యాపారి ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వినోద్ బాలు, కిరణ్, అజయ్, జాగరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిత్రం.. భళారే విచిత్రం

- మిథ్యగా మారుతున్న అగనంపూడి నిర్వాసితకాలనీల్లో పాఠశాల విద్య
- రెండు జిల్లాలు, రెండు మండలాల మధ్య నలుగుతున్న విద్యార్థులు
- ఒక హైస్కూల్, ఐదు ప్రాథమిక పాఠశాలలు పరవాడ మండల విద్యాశాఖ ఆధీనంలో..
- రెవెన్యూ, ఇతర లావాదేవీలన్నీ గాజువాక మండల పరిధిలో..



నిర్వాసిత కాలనీలోని పెదమడక పాఠశాల




వసతులు లేని పినమడక పాఠశాల

అగనంపూడి: అగనంపూడి నిర్వాసిత కాలనీలకు చెందిన పిల్లల విద్య మిథ్యగా మారుతోంది. ఈ కాలనీల్లో పాఠశాల విద్య చిత్ర విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటుంది. రెండు జిల్లాలు... రెండు మండలాల మధ్య ఈ కాలనీల్లోని పాఠశాలలు నలుగుతున్నాయి. 85, 79 వార్డుల్లో విస్తరించిన అగనంపూడి నిర్వాసిత కాలనీల్లోని పాఠశాలలు సగం పరవాడ మండల విద్యాశాఖ ఆధీనంలో, మిగిలిన పాఠశాలలు గాజువాక మండల విద్యాశాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి.

ఇదీ పరిస్థితి


విశాఖ ఉక్కు కర్మాగారం నిర్మాణం కోసం అవసరమైన భూమిని పరవాడ మండల పరిధిలోని పెదమడక, పినమడక, డొంకాడ, పూడివానిపాలెం, కొత్తూరు, కర్రివానిపాలెం, అట్టవానిపాలెం, దిబ్బపాలెం, దానబోయినపాలెం, తలారివానిపాలెం గ్రామాల నుంచి సేకరించింది. ఈ గ్రామాలను 1994లో అగనంపూడి రెవెన్యూ పరిధిలో మూడు సెక్టార్లగా విభజించి పునరావాసం కల్పించారు. పునరావాస సమయంలో ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాలలను యథావిధిగా నిర్వాసిత కాలనీల్లోనూ ఏర్పాటు చేశారు. ఒక హైస్కూల్, 9 ప్రాథమిక పాఠశాలలను ఆయా గ్రామాల పేరుతో అప్పట్లో ఏర్పాటు చేశారు. అగనంపూడి రెవెన్యూ, గాజువాక మండల పరిధిలోకి ఈ కాలనీలను తరలించినా పాఠశాలలను మాత్రం పరవాడ మండల శాఖ ఆధీనంలో కొనసాగిస్తూ వస్తున్నారు. మూడు దశాబ్దాలు దాటినా కూడా విద్యావిభాగం పరవాడ మండల పరిధిలోనే ఉంది. 2003లో ఒకే ఆవరణలోని నాలుగు పాఠశాలలను విలీనం చేయడంతో ఐదు ప్రాథమిక పాఠశాలలు, ఒక ఉన్నత పాఠశాల మిగిలిపోయాయి.



ఉక్కు నిర్వాసిత కాలనీ

జీవీఎంసీలో విలీనమైనా..

పాఠశాలల్లో వసతుల కల్పన, పర్యవేక్షణ మాత్రం పరవాడ మండల విద్యాశాఖ చేపట్టాలి. ఈ గ్రామాలు జీవీఎంసీలో విలీనం జరిగినా పర్యవేక్షణ మాత్రం పరవాడలోనే కొనసాగుతూ వస్తుంది. పరవాడ మండలాభివృద్ధి విభాగం ఒక్క రూపాయి కూడా ఈ పాఠశాలల కోసం కేటాయించిన దాఖలాలు లేవు. దీంతో కనీస వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. చాలా పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎస్ఎస్ఏ నిధులు మినహా ఎటువంటి మండల గ్రాంట్ ఇక్కడ ఖర్చు చేయడంలేదు.



గాజువాక రెవెన్యూ పరిధిలోని నిర్వాసిత కాలనీ

పట్టించుకోని జీవీఎంసీ

అలాగని జీవీఎంసీ కూడా పాఠశాలల నిర్వహణ, వసతుల కల్పన గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. వెరసి ఇక్కడ పాఠశాల విద్య అగమ్యగోచరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు.

గాజువాకలో విలీనం చేయాలి



గాజువాక రెవెన్యూ, విశాఖ జిల్లాలో గ్రామాలు ఉన్నా పాఠశాలలు పరవాడ మండల విద్యాశాఖ ఆధీనంలోఉన్నాయి. తక్షణమే గాజువాక విద్యాశాఖ పర్యవేక్షణలోకి తీసుకోవాలి. అప్పుడే పూర్తిస్థాయిలో పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడానికి వీలుంటుంది. ప్రస్తుతం రెండు జిల్లాల అధికారులు ఈ పాఠశాలలపై దృష్టి పెట్టడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి గాజువాక మండల విద్యాశాఖ పరిధిలోకి చేర్చాలి.

– ఏదూరి రాజేష్, పినమడక

నిర్వహణ అస్తవ్యస్తం



నిర్వాసిత కాలనీల్లో పాఠశాల విద్య అస్తవ్యస్తంగా మారింది. వసతులు లేకుండా అధికారులు మూడు దశాబ్దాలుగా పాఠశాలలను నెట్టుకువస్తున్నారు. కాని ఎవరికీ పట్టడం లేదు. మరీ ఇంత నిర్లక్ష్యం తగదు. రెండు జిల్లాల మధ్య నలుగుతున్న ఈ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. పాలకులు స్పందించి వెంటనే విశాఖ జిల్లా పరిధిలోకి ఈ పాఠశాలలను చేర్చాలి.

– గుదే గజేంద్రరావు, పెదమడక

జిల్.. జిగేల్



ఈ మనోహర దృశ్యం స్టీల్‌ప్లాంట్ ప్రధాన రహదారిలోనిది. కూర్మన్నపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే విశాలమైన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు ప్రయాణికులకు స్వాగతం చెబుతున్నాయి. ఈ మార్గం విద్యుత్ దీప కాంతులతో ఆకట్టుకుంటుంది. వీటికి శీతాకాలం మంచు తెరలు కూడా తోడవడంతో ఆ రహదారి మరింత సుందరంగా దర్శనమిస్తోంది. రాత్రి వేళ ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారికి ఆహ్లాదం పంచుతోంది. – ఉక్కునగరం

అనాథ బాలలకు సరకుల వితరణ



అనాథ బాలలకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

పెదగంట్యాడ: ప్రత్యేక అవసరాల గల పిల్లలు, అనాథలకు తన వంతు సాయం చేస్తున్నానని ఎస్ఆర్ఐ సుధీర్‌రెడ్డి అన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా డిజైర్ సొసైటీలోని అనాథ బాలలకు ఆదివారం నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ, రజనికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు పోరాడుతాం



పోస్టు కార్డులను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన పది లక్షల పోస్టు కార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టు కార్డుల ఉద్యమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులతో కలసి పోస్టు కార్డులను స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నాగిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పల్లా చినతల్లి, మార్టుపూడి పరదేశి, నక్కా వెంకటరమణ, పిట్టా రెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, వాసా అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కాలుష్యంపై ఉద్యమిస్తాం



వై జంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు కాలుష్యాన్ని నియంత్రించకపోతే ఉద్యమిస్తామని సీపీఎం జోన్ కార్యదర్శి రాంబాబు హెచ్చరించారు. సీపీఎం ఆధ్వర్యంలో వై జంక్షన్ వద్ద పోర్టు కాలుష్యంపై ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు కాలుష్యం కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న నిర్వాసిత కాలనీ వాసులకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించాలని కోరారు. గంగవరం పోర్టు నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా సుమారు 20 గ్రామాల ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో ఈ ప్రాంతాల్లో క్యాన్సర్ బాధితులు పెరిగారని, అలాగే గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో పాటు చర్మ వ్యాధులతో జనం అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా పోర్టు యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పోర్టు కాలుష్య సమస్యను పరిష్కరిస్తామని, వై జంక్షన్ మీదుగా భారీ వాహనాలు వెళ్లకుండా మళ్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి గంగవరం పోర్టు కాలుష్య సమస్యకు చెక్ చెప్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి.రమణ, త్రినాథ్ స్వామి, గొలగాని అప్పారావు, గణేష్, జి.లక్ష్మి, రమణ, రాము పాల్గొన్నారు.

ద్వారకాపురి కాలనీలో స్వచ్ఛ భారత్



కార్యక్రమంలో పాల్గొన్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు వుడా ఫేజ్–2 ద్వారకాపురి కాలనీలోని బృందావన్ పార్కులో ద్వారకాపురి అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పార్కు ఆవరణలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు సాయిరామరాజు మాట్లాడుతూ కోట్ల రూపాయలతో ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తుంటే ఆకతాయిలు ఆవరణాన్ని పాడుచేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. పది మందికి ఆహ్లాదాన్ని పంచే ఆస్తులను కాపాడాలి తప్పా వాటిని ధ్వంసం చేయడం వల్ల వ్యక్తిగతంగా పొందే లబ్ధి ఏమీ ఉండదన్నారు. ఉద్యానవనాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు యువత సహకరించాలని కోరారు. తర్వాత పార్కును పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆవరణాన్ని కాపాడుకోవాలని ప్రతిజ్ఞ చేశారు కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.వి.రాజు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.వి.స్వామి, వాకర్స్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక/అగనంపూడి: సమగ్ర రైతు సహకార సంస్థ (ఇఫ్కో) ఆధ్వర్యంలో మహిళలకు ఆదివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. 87వ వార్డులో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 70వ వార్డులో వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు చేతులమీదుగా కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇఫ్కో అందిస్తున్న ప్రోత్సాహకాలను మహిళలు వినియోగించుకోవాలన్నారు. తమ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 56 వేల మహిళా బృందాలకు స్వయం ఉపాధి కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమాల్లో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వార్డుల నాయకులు చట్టి గోపి, బాటా శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు కుమార్ స్వామి, ప్రదీప్, సునీత, దీపా కుమారి పాల్గొన్నారు.

ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సాహం



సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పల్లా తదితరులు



ఫైనల్‌కు చేరిన విశాఖ బాలికల జట్టు

- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు
- నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు విశాఖ బాలికల జట్టు



అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన

అగనంపూడి: క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం నూతన పాలసీ ప్రకటించిందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన రెండో రోజు నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు కూడా రూ.లక్ష నజరానా ఇవ్వనున్నట్టు చెప్పారు. క్రీడాకారులు పోటీతత్వంతో పాటు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రేమ్‌కుమార్, పాఠశాల హెచ్ఎం సూర్య ప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు, వెంకటరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.దేముడు పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన విశాఖ బాలికల జట్టు

ఆదివారం నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి విశాఖ బాలికల జట్టు నెల్లూరు జట్టుపై 28–8 తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. సోమవారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది పీడీలు మన్నాజీ, నారాయణరావు, వెంకటరావు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డులో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ పాతఅగనంపూడి, పిల్లేలమ్మ గుడి, వేపచెట్టు జంక్షన్, గళ్లవానిపాలెంల్లో రూ.రెండు కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో 79, 87వ వార్డు కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, బొండా జగన్, నాయకులు గొల్లవిల్లి కనక భవాని, కరణం సత్యారావు పాల్గొన్నారు.

25లోగా బూత్ కమిటీల నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గాజువాక: నియోజకవర్గంలోని అన్ని బూత్‌లకు ఈ నెల 25లోగా కమిటీలను ఏర్పాటుచేస్తామని బీజేపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్ధా లక్ష్మీనారాయణ చెప్పారు. గాజువాక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాక నాయకులు నియోజకవర్గంలో 34వేల సభ్యత్వాలు పూర్తి చేసి రాష్ట్రంలో ఏడో స్థానంలో, జిల్లాలో 2వ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాలిమేర శ్రీనివాసరావు, సోంబాబు, రోహిణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధరల దరువు

- చిక్కుడు చిక్కడం లేదు
- భారమైన బీరకాయలు
- కిలో ధర రూ.120
- ఘాటెక్కిన వెల్లుల్లి



గాజువాక: కూరగాయల ధరలు సామాన్యులను హడలెత్తిస్తున్నాయి. వండక ముందే ఉడికి పోతున్నాయి. తినక ముందే అరిగిపోతున్నాయి. కేజీ కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లి పావుకిలో కూడా తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. ఏ కూరగాయను కొందామన్నా ధర చూస్తే చుక్కలు కనిపిస్తున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. వారపు సంతల్లో సైతం కూరగాయల ధరలు ఆకాశానికి ఎగబాకాయి. సంతలతో పాటు బయట దుకాణాల్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. వడ్లపూడి వారపు సంతలో కిలో చిక్కుడు కాయలు రూ.120, కిలో బీరకాయలను రూ.120 చొప్పున విక్రయించారు. నెల రోజుల కిందట రూ.60 ఉన్న ఈ రెండు కూరగాయల ధరలు ప్రస్తుతం రెట్టింపయ్యాయి. వెల్లుల్లి అందనంత దూరంలో ఉంది. మంచి రకం ప్రైవేటు మార్కెట్‌లో రూ. 500 వరకు విక్రయిస్తున్నారు. దీంతో చాలా మంది నెల రోజులుగా వెల్లుల్లి ఊసే మరిచిపోయామని చెబుతున్నారు.

సెంచరీకి చేరువలో..

బయట మార్కెట్‌లో దాదాపు అన్ని రకాల కూరగాయల ధరలు సెంచరీకి చేరువలో ఉన్నాయి. వంకాయలు కిలో రూ.80, టమాటా కిలో రూ.50, ఉల్లిపాయలు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక చిన్న దుకాణాల్లో అయితే ధర అదనం. ఒక్క అరటికాయను(సైజు బట్టి) రూ.10 నుంచి 14 చొప్పున విక్రయిస్తున్నారు. ధరలు భారీగా పెరగడంపై కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ధరలు నియంత్రించాలని కోరుతున్నారు. కాగా, కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

క్రీడాపోటీల విజేతలకు అభినందన



నిర్వాహకుల నుంచి మెడల్స్ అందుకుంటున్న క్రీడాకారులు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు లంకెలపాలేనికి చెందిన కింతాడ చందన ఎంపికైంది. ఈనెల 7 నుంచి 9వ వరకు కాకినాడ స్పోర్ట్స్ స్టేడియంలో అండర్–19 బాలికల విభాగంలో పోటీలు నిర్వహించగా చందన తృతీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. చందన ప్రస్తుతం ఉక్కునగరలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వచ్చే నెల 9 నుంచి 14వ తేదీ వరకు కోల్‌కతాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో చందనతో కూడిన జట్టు పాల్గొననుంది. ఈ మేరకు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన చందనతో మిగిలిన వారిని అభినందించారు.